క్లుప్తంగా

ఐస్‌తో చిల్



నగరంలో మూడ్రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. దీంతో నగరవాసులు వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు శీతల పానియాలు, కొబ్బరినీరు, మజ్జిగ వంటివి సేవిస్తున్నారు. మూగజీవాలు సైతం దాహార్తిని తీర్చుకునేందుకు నానాపాట్లు పడుతున్నాయి. ఆదివారం నగరంలోని తడికలబజారు సెంటర్ సమీపంలోని ఓ షోడా బండి వద్దకు వచ్చిన దాహంతో వచ్చిన వానరానికి ఐస్ ముక్కను అందజేయగా చేతపట్టుకుని వెళ్లి తీర్చుకుంది.
–నెల్లూరు(వీఆర్సీసెంటర్)

నేటి నుంచి గంధ మహోత్సవం

చేజర్ల (సోమశిల): అనంతసాగరంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్ షా మష్ కూర్ దర్గాలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు గంధ మహోత్సవం జరుగుతుందని దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్ షా సాహెబ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీ రాత్రి 7 గంటలకు ఘనంగా గంధ మహోత్సవం ప్రారంభమవుతోందన్నారు.

బుచ్చి ఉపాధ్యాయుడికి పురస్కారం



పురస్కారం అందుకున్న సుధీర్‌కుమార్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : బుచ్చిరెడ్డిపాళెంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, జిల్లా రిసోర్స్ గ్రూపు సభ్యుడు గండికోట సుధీర్‌కుమార్ ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా ఆదివారం ఎక్సలెన్సీ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ విద్యాబోధనలో సుధీర్‌కుమార్ వినూత్నమైన విధానాలను అనుసరిస్తూ ఆటపాటల ద్వారా విద్యను అందించడంలో ప్రత్యేక గుర్తింపు సాధించారని ప్రశంసించారు. కాగా పురస్కారం అందుకున్న సుధీర్‌కుమార్‌ను ఎంఈఓలు ఎం.దిలీప్‌కుమార్, పీవీ రత్నం, ఉపాధ్యాయులు అభినందించారు.

పాముల కలకలం

- రెండు వేర్వేరు ప్రాతాల్లో బైకుల్లో దూరిన పాములు

ఆత్మకూరు: పట్టణంలోని హిల్‌రోడ్డు ఆటోనగర్, కూరగాయల మార్కెట్ వద్ద ఆదివారం పార్కింగ్ చేసిన రెండు బైక్‌ల్లో పాములు దూరి కలకలం సృష్టించాయి. స్థానికుల సమాచారం మేరకు ఆటోనగర్‌లో మెకానిక్ పనులు చేస్తున్న క్రమంలో సమీపంలోని చెట్టుపై నుంచి కిందపడిన ఓ పాము నిలిపి ఉన్న బైక్‌లోకి దూరింది. గమనించిన కొందరు బైక్‌లో నుంచి ఆ పామును బయట తీసేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. ఎంతసేపటికి అది వెలుపులకు రాలేదు. దీంతో కొందరు యువకులు సాహసించి బైక్ స్పేర్‌పార్ట్స్‌ను ఒక్కొక్కటిగా విడదీసి శబ్దాలు చేయడంతో బయటకు వచ్చిన పాము ఎదురుగా ఉన్న దుకాణంలోకి దూరింది. ఓ యువకుడు బయటకు తెచ్చి కొట్టి చంపేశాడు. విషపూరితమైన పాముగా గుర్తించారు. ఈ ఘటనకు కొద్దిసేపు ముందర కూరగాయల మార్కెట్‌లో నిలిపి ఉన్న బైక్‌లోకి ఓ పాము దూరింది. మార్కెట్‌లో పనిచేస్తున్న వారు గమనించి బయటకు తీసి చంపేశారు. ఒకే రోజు ఒకే సమయంలో రెండు పాములు వేర్వేరు ఘటనల్లో బైక్‌ల్లోకి దూరడం పట్టణంలోని చర్చనీయాంశమైంది.

ఏజీఎఫ్ అథ్లెటిక్స్‌లో ఆదర్శ కళాశాల విద్యార్థుల సత్తా



ఏజీఎఫ్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన నాగమణి, లీలావతి, సహన

కొండాపురం: ఏజీఎఫ్ అథ్లెటిక్స్ క్రీడల ఎంపికలో కొండాపురం ఆదర్శ కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఖాదర్‌బాషా ఆదివారం తెలిపారు. కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న నాగమణి, లీలావతి, సహన, భాను ప్రకాష్ ఐదు విభాగాల్లో ప్రతిభ కనబరిచారన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, షార్ట్‌పుట్‌లో ప్రథమ స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, 200 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. దీంతో కళాశాల ప్రిన్సిపల్ ఖాదర్‌బాషా, పీఈటీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ప్రభుత్వ వాహనాలకు నిర్లక్ష్యపు తుప్పు



ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు వినియోగించాల్సిన వాహనాలను నిరుపయోగంగా వదిలేశారు. చిన్నపాటి మరమ్మతులకు గురైన వాహనాలపై అధికారులు నిర్లక్ష్యం చూపడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పు పట్టిపోతున్నాయి. ఇలా జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయ ఆవరణంలో పదుల సంఖ్యలో వాహనాలు దర్శనమిస్తున్నాయి. తుప్పుపట్టిన వాహనాలను స్క్రాప్ కింద విక్రయించినా ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఆ దిశగా కూడా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
–సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు





నగర వనం అభివృద్ధికి చర్యలు చేపట్టాలి



నగర వనాన్ని పరిశీలిస్తున్న సీసీఎఫ్ శ్రీనివాసులురెడ్డి

- సీసీఎఫ్ వై శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(బారకాసు): నగరానికి సమీపంలో పొదలకూరు రహదారి పక్కన అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నగర వనాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వై శ్రీనివాసులురెడ్డి అటవీ శాఖ అధికారులకు సూచించారు. ఆదివారం నెల్లూరు వచ్చిన ఆయన జిల్లా అటవీ శాఖ అధికారి చంద్రశేఖర్, ఇతర అధికారులతో కలిసి నగర వనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీఎఫ్ మాట్లాడుతూ నెల్లూరు నగర ప్రజలు సేదతీరేందుకు నగర వనాన్ని ఇప్పటికే సిద్ధం చేశామన్నారు. ఇంకా మిగిలి ఉన్న పనులను పూర్తిచేసి మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలన్నారు. నగర వనంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల వసతులు కల్పించి వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా నగర వనం ప్రాంతంలో ఉన్న కొండమీదకు ఎక్కి ప్రజలు ప్రకృతి అందాలను తిలకించేలా తగిన సౌకర్యాన్ని కల్పించాలన్నారు. అందుకు తగిన ప్రణాళికలు రూపొందించి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ చంద్రశేఖర్, ఇన్‌చార్జి నెల్లూరు ఫారెస్ట్ రేంజర్ మాల్యాద్రి, ఎఫ్ఎస్ఓ శేషయ్య, ఎఫ్‌బీఓ మనోజ్, రామకృష్ణ పాల్గొన్నారు.

శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కొండ్రెడ్డి రంగారెడ్డి

నెల్లూరురూరల్: నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 15 నుంచి జరుగనున్న 49వ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రికలను విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండ్రెడ్డికి దేవస్థానం అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. రామమూర్తినగర్‌లోని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఏవీ శ్రీనివాసులురెడ్డి, దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు దొరబాబు, ఎం రామమోహన్‌రెడ్డి, శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి సేవా సమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ విధిగా ధరించాలి



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న వేమారెడ్డి

నెల్లూరు(క్రైమ్): ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కే వేమారెడ్డి సూచించారు. ఆదివారం బుజబుజ నెల్లూరు (క్రాస్‌రోడ్డు) వద్ద జాతీయ రహదారిపై వాహనచోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహన ప్రమాదాల్లో అధిక శాతం మంది తలకు తీవ్రగాయాలై మృతి చెందుతున్నారన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలను రక్షించుకోవచ్చన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా పాటించాలని, ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సౌత్ ట్రాఫిక్ ఎస్సై వెంకటరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చందన, సీఎమ్మార్ వీక్లీడ్రా విజేత పద్మావతి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, సీఎమ్మార్ అధినేత మావూరి

నెల్లూరు(బృందావనం): దసరా, దీపావళి సందర్భంగా చందన, సీఎమ్మార్ నిర్వహిస్తున్న వీక్లీ లక్కీడ్రా బహుమతి హీరో బైక్‌ను నెల్లూరుకు చెందిన వీ పద్మావతి(కూపన్ నంబర్ 5095) గెలుచుకుంది. ఆదివారం సీఎమ్మార్‌లో వీక్లీ డ్రాను నెల్లూరు నగర డీఎస్పీ డీ శ్రీనివాసులురెడ్డి తీశారు. ఎడ్లవారివీధికి చెందిన వీ పద్మావతిని విజేతగా ప్రకటించారు. అనంతరం డైలీ డ్రా విజేతలు 35 మందికి గ్రైండర్లు, ఎలక్ట్రిక్ కుక్కర్లు, మిక్సీలు, ఇండక్షన్ స్టౌవ్‌లు, త్రీ పీస్ నాన్‌స్టిక్స్ పాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా నగర డీఎస్పీ మాట్లాడుతూ చందన, సీఎమ్మార్ వినియోగదారులకు వస్త్రాలను, బంగారాన్ని తక్కువ ధరలకు విక్రయించడంతో పాటు పండగల సందర్భంగా గృహిణులకు ఉపయోగపడే వస్తువులు, హీరో బైక్స్‌లు, రెనాల్ట్ క్విడ్ కార్‌ను బహుమతులుగా అందజేయడం అభినందనీయమన్నారు. సీఎమ్మార్ అధినేత మావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ దసరా, దీపావళి సందర్భంగా రూ.1000 వస్త్రాలు, రూ.5 వేల బంగారు ఆభరణాల కొనుగోలుపై డైలీ, వీక్లీ లక్కీడ్రా కూపన్లు అందజేస్తున్నామని తెలిపారు. రాజీయాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, మేనేజర్ వాసు, శైలేష్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బిందుమీనన్‌కు న్యామ్స్ ఫెలోషిప్



అవార్డును అందుకుంటున్న డాక్టర్ బిందుమీనన్

నెల్లూరు సిటీ: సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందుమీనన్ బెంగుళూరులోని నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్(న్యామ్స్) నుంచి ప్రతిష్టాత్మక ఫెలోషిప్‌ను అందుకున్నారు. బెంగుళూరులోని నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ 63వ వార్షిక సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అకడమిక్ ఎక్స్‌లెన్స్, పరిశోధన, ప్రచురణలు, కాన్ఫరెన్స్‌ల్లో ప్రదర్శన, సైంటిఫిక్ కమిటీలో పదవులు పొందిన, సమాజ సేవలో ప్రతిభకనబర్చిన వారికి పురస్కారాలను ప్రదానం చేశారు. అందులో భాగంగా బిందుమీనన్‌కు ఫెలోషిప్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, ప్రొఫెసర్ ఎస్‌పీ సింగ్ బఘెల్, రాష్ట్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జితేంద్రసింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాస్టర్స్ డే




పాస్టర్లు శామ్యూల్‌కుమార్, మోసెస్ దంపతులకు సత్కారం

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని ది తెలుగు సెకండ్ బాప్టిస్టు చర్చిలో పాస్టర్స్ డేను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ పాస్టర్ రెవరెండ్ శామ్యూల్ కిషోర్, బ్రాంచ్ సంఘ పాస్టర్ రెవరెండ్ మోసెస్ దంపతులను సంఘ చైర్మన్ ఉరందూరు సురేంద్రబాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ప్రశాంత్‌కుమార్, వైస్‌చైర్మన్ అగ్గిరప్ప, సహాయ కార్యదర్శి స్వజని, కోశాధికారి సలోమి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గంధ మహోత్సవం

చేజర్ల (సోమశిల): అనంతసాగరంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్ షా మష్‌కూర్ దర్గాలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు గంధ మహోత్సవం నిర్వహించనున్నట్లు దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్ షా సాహెబ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీ రాత్రి 7 గంటలకు ఘనంగా గంధ మహోత్సవం ప్రారంభమవుతోందన్నారు.

మాతమ్మతల్లికి పొంగళ్లు



కలిగిరి: అనంతపురం గ్రామ దేవత మాతమ్మ తల్లికి ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవి రెడ్డి, ఎంపీపీ శిరీష దంపతులు ఆదివారం పొంగళ్లు పెట్టారు. అమ్మ వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

16న మాతమ్మ విగ్రహ ప్రతిష్ట

ముత్తుకూరు : మండలంలోని నారికేళపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీమాతమ్మ అమ్మవారి ఆలయంలో ఈనెల 16వ తేదీన శిలాప్రతిష్ట మహోత్సవం నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహకుడు కాటంరెడ్డి వసంతకుమార్‌రెడ్డి దివారం తెలిపారు. అందులో భాగంగా ఈనెల 13వ తేదీ నుంచి సంప్రదాయబద్ధంగా ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి



12వ డివిజన్‌లో మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి



27వ డివిజన్‌లో మాట్లాడుతున్న కొండ్రెడ్డి రంగారెడ్డి

నెల్లూరు రూరల్: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. రూరల్ నియోజకవర్గంలోని 12వ డివిజన్‌లో నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు రూరల్ క్లస్టర్–1 పరిధిలోని గృహసారథులు, వలంటీర్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎనలేని విధంగా అభివృద్ధి జరిగిందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వేదాయపాళెంలో..

రూరల్ పరిధిలోని వేదాయపాళెంలోని నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి విగ్రహ సమీపంలోని కల్యాణ మండపంలో మా నమ్మకం నీవే జగనన్న సమావేశాన్ని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలను ఆయన వివరించారు.

వేదగిరిని దర్శించుకున్న అడిషనల్ జిల్లా జడ్జి



నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహకొండపై కొలువైన శ్రీవేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని జిల్లా ఐదో అదనపు జడ్జి సరస్వతి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. దేవాదాయశాఖ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవారి సన్నిధిల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు.

మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు హేయం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత మల్లి నిర్మల

- వైఎస్సార్‌సీపీ మహిళా నేత మల్లి నిర్మల

నెల్లూరు(దర్గామిట్ట): మంత్రి రోజా మహిళ అని కూడా చూడకుండా ఆమెపై టీడీపీ నేత బండారు సత్యనారాయణ అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా నాయకురాలు మల్లి నిర్మల ఖండించారు. మాగుంటలేఅవుట్‌లోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరులతో సమావేశంలో ఆమె మాట్లాడారు. మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నాయకుడు బండారు సత్యనారాయణతో పాటు ఆ పార్టీని సభ్యసమాజం ఛీదరించుకుంటోందన్నారు. 2019లో పెందుర్తి నియోజకవర్గంలో బండారుకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. 2024 ఎన్నికల్లోనూ పెందుర్తి ప్రజలే గుండు గీసి పంపుతారన్నారు. మహిళా జడ్జిపై టీడీపీ దౌర్జన్యాలపై స్పందించిన విధంగానే మంత్రి రోజాపై బండారు చేసిన అనుచిత వ్యాఖ్యలపై రాష్ట్రపతి స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి రోజాను టీడీపీ వారు ఐరన్ లెగ్‌గా ముద్రవేస్తే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆమెను ఆదరించి ఎమ్మెల్యే, మంత్రిని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ మహిళా కార్యదర్శి ధనుజారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బెల్లంకొండ వాణి, కార్యదర్శులు ప్రమీల, సరిత, రంగనాయకులస్వామి పాలక మండలి సభ్యులు ఎం శివాని, వైఎస్సార్‌సీపీ నాయకులు పద్మ, తదితరులు పాల్గొన్నారు.

సర్వజనుల శ్రేయస్సును కాంక్షించేదే సనాతన ధర్మం



అర్చకులకు సత్కారం

నెల్లూరు(బృందావనం): సర్వజనుల శ్రేయస్సును కాంక్షించి ప్రపంచానికి ఆధ్యాత్మిక వెలుగులను ప్రసాదిస్తున్న సనాతన ధర్మాన్ని దూషించడం, అవహేళన చేయడం మానసిక మరుగుజ్జుతనానికి నిదర్శనమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి పేర్కొన్నారు. పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో హైందవ ధర్మ ఆచార, వ్యవహారాలు, సనాతన ధర్మ విశిష్టతను చాటుతూ ''సనాతన ధర్మం వర్ధిల్లాలి'' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కందికట్ల ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతీయ సనాతన ధర్మం ఎంతో ఉన్నత విలువలు కలిగిందని వివరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బ్రహ్మజ్ఞాని రాఘవేంద్ర గోపిస్వామి, మల్లవరపు శరవణస్వామిని ఘనంగా సత్కరించారు. ఔత్సాహిక గాయకులు ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు బత్తిన సాయి కుమార్‌రెడ్డి, చీమకుర్తి వెంకటేశ్వరరావు, పీ సుజాత రెడ్డి, మారం సుధాకర్, వెన్నెల, శింగంశెట్టి మురళీమోహన్‌రావు, డీ సునీల్‌బాబు, అడ్వొకేట్ రామకృష్ణ, మిడతల రమేష్, పొట్లూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమాన ధర్మం కావాలి



మాట్లాడుతున్న ధనలక్ష్మి

నెల్లూరు (టౌన్): సమాజంలో సనాతన ధర్మం కాదు సమాన ధర్మం కావాలని ఆంధ్రప్రదేశ్ శ్రామిక మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి అన్నారు. నగరంలోని అన్నమయ్య సర్కిల్‌లోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ శ్రామిక మహిళా సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో మతోన్మాధులను, వారిని సమర్థించే వారిని ఓడించాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ రాష్ట్రాధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పాఠశాలల విలీనం వల్ల బాలికలు చదువుకు దూరం అవుతున్నారన్నారు. పాఠశాలల పరిరక్షణ, పాత పెన్షన్ సాధన కోసం జరిపే పోరాటాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా రాష్ట్ర కార్యదర్శి నాగమణి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, రాష్ట్ర మహిళా నాయకులు శ్రీదేవి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శేషు, చలపతిశర్మ, మహిళా నాయకులు సాజితాబేగం, రమాదేవి, భారతి, జిల్లా కోశాధికారి మురళి, జిల్లా కార్యదర్శులు నాగిరెడ్డి, సురేంద్రబాబు, మోహన్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.